

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కామెడీ సర్కస్

**మిడిల్‌క్లాస్** ఇళ్ళల్లో ఉన్నంత కామెడీ మరియూ సర్కస్ ఇంక ఏ ఇళ్ళల్లోనూ ఉండదు. నిన్నటిదాకా పార్క్‌లో ప్రియురాలితో కూర్చుని "ఈ పెద్దాళ్ళున్నారే చాలా బ్యాడ్ ఫెలోస్ . మా నాన్న స్కూటర్ కొనద్దంటాడు. రాత్రి రెండో ఆటకి వెళ్ళొద్దంటాడు. హోటల్స్‌లో డబ్బులు తగలెయ్యొద్దంటాడు. ఏ గదిలోంచైనా ఇవతలకొస్తుంటే లైట్ ఆర్పకపోతే తిడ్తాడు. ఓల్డ్ పీపుల్" అని వాపోయిన సుబ్బారావులే పెళ్ళవగానే, భర్తగా మారి కాస్త పీనాసితనం మొదలు పెడ్తారు.

"ఏవండీ సినిమా కెళ్దాం"

"చూడు అలకా? ఈ నెలలో రెండు సినిమాలు చూసాం. సినిమా కన్నా సహవాద్యాల మోత ఎక్కువగా ఉంది. నువ్వు సినిమాకెళ్ళగానే గిర్నీ ఆడించినట్టు నోరు ఆడిస్తావు. దిక్కుమాలిన మల్టీప్లెక్స్‌లలో మంచినీళ్ళు ముప్పై, బయట ఇరవై. పాప్‌కార్న్ తొంభై.. బయట పాతిక.. కోక్... నూటయాభై బయట యాభై" ఇలా చెప్పుకుపోతాడు.

అలక అలిగి పడుకుంటుంది. కానీ రేపు తండ్రి అవగానే ఈ రొమేంటిక్ 'సుబ్బూ' కాస్తా కళ్ళద్దాల క్రమాస్టారు సుబ్బారావుగా పరివర్తనం చెందుతాడు. మా కాలంలో అయినా ఏ కాలంలో అయినా ఇంతే! "నాన్న స్కూటర్ కొనుక్కుంటా" అంటే కొడుకు, సుబ్బారావు వెంటనే "ఆ డబ్బు ఎఫ్.డీలో వెయ్యి. నాలుగు సంవత్సరాలకి వడ్డీతో కలిసి మరో పదివేలు పెరుగుతాయి" అంటాడు.

ఎఫ్.డీ మీద కూర్చుని ఆఫీస్‌కి వెళ్ళలేడుగా కొడుకు.

తనతండ్రి ఇలా అనడం వలన తను ఎంతగా వగచాడో మర్చిపోతాడు సుబ్బారావు. ఎందుకంటే ఇప్పుడు తండ్రి పాత్ర తనది.

"బాత్‌రూములో లైట్ ఆర్పలేదేం?" అంటాడు గదిలో లైట్ వేసుకుని లాప్‌టాప్ చూస్తున్న కొడుకుతో.

"మర్చిపోయా డాడ్."

"యూనిట్‌కి ఎంతో తెలుసా?"

క్లాస్ మొదలూ .. కొడుకు లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి లైట్ ఆర్పేదాకా, వీపుకి తన కళ్ళు గుచ్చి ఉంచేస్తాడు.

తను ప్రపంచానికి చేసిన ద్రోహానికి ఆ కొడుకు పశ్చాత్తాపంతో దహించుకు పోయేంత గిల్టీగా ఫీల్ చేస్తాడు.

కానీ బాత్‌రూమ్‌లో లైట్ ఆర్పిన కొడుకుకి సెల్‌రింగ్ అవడంతో, బాల్కనీలో ఫ్రెండ్‌తో మాట్లాడుతూ నిలబడ్డాడు.

సుబ్బారావుకి మళ్ళీ గదిలో ట్యూబ్‌లైట్ దేదీప్యమానంగా వెలుగుతూ కనిపించి వ్యాకులత పెరిగిపోతుంది.

"మా బుడ్డాగాడింకా నిద్రపోలేదురా. నైట్ షో కెళ్తే క్లాస్ పీకుతాడు. భయం కాదురా యార్. ఆ క్లాసులు వింటే చచ్చిపోవాలనిపిస్తుంది. మనవల్లా, మన నైట్ షోలవల్లా దేశానికి చాలా ఉపద్రవం వచ్చేస్తుందని లెక్చరిస్తాడు. ఈ మధ్య రిటైర్ అయ్యాడుగా. ఫుల్‌టైం క్లాసులు పీకుతున్నాడు. 'ఎకనామిక్స్.. మా బుడా"! అని స్టాండప్ కామెడీ చెయ్యొచ్చు." అంటూ వెనక్కి తిరిగితే కొడుకు, చీకట్లో సుబ్బారావు కళ్ళు మెరుస్తూ అతని వీపు వెనకాలే కనిపిస్తాయి.

"నేనేనా ఆ 'బుడ్డా?' మా నాన్నగారిని నేను ఎప్పుడూ 'నువ్వు' అనలేదు తెలుసా? నాన్నగారండీ. అని తప్ప పిలిచెరగము. నేను 'బుడ్డాగాడినా?' " అని క్లాస్ మొదలైపోతుంది.

కొడుకుకి పశ్చాత్తాపంతో మేడమీదనుండి కిందకి దూకి చద్దామా అన్నంత ఫీలింగ్ వస్తుంది కానీ, దూకాక, కాలో చెయ్యి విరిగి బతికితే "అమ్మానాన్నలు తిండీ, బట్టా, సరదాలూ అన్నీ ఇచ్చి ఓ మాటంటే పడలేరురా? మాకు కడుపుకోత పెడ్తారా? మీరూ రేపు తల్లిదండ్రులయ్యాకా తెలుస్తుందిరా" అన్న శాపాలతో స్పెషల్‌క్లాసు గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకుంటాడు.

"నాన్నా.. నాకు జాబ్ వచ్చింది"

"లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకో.."

"ఇంక్రిమెంట్ వచ్చింది"

"కొత్త పాలసీ తీసుకో"

"ఫెస్టివల్ ఎడ్వాన్స్ వచ్చింది"

"సేవింగ్స్ సర్టిఫికెట్ కొను"

"నాన్నా.. ఇవన్నీ ఎప్పుడు చేతికొస్తాయి?"

"నీకు యాభై ఆరో ఏట. ఈ పాలసీ మెచ్యూర్ అయి నువ్వు కట్టిన ఇరవైలక్షలకి డబుల్ వస్తుంది. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్‌కి యాభైవేలకీ అరవై వస్తుంది"

"అప్పటికి నేనూ నీలా రాందేవ్ బాబా చెప్పిన యోగాతో, వీరమాచనేని చెప్పిన డైట్‌ప్లాన్‌తో, చాగంటిగారి ప్రవచనాలతో, వాసుదేవ్‌గారి ఫిలాసఫీతో, టీ.వీ ముందు కూర్చుని గోధుమగడ్డి, రాగిజావా తాగుతూవుంటా! పక్కన నా పెళ్ళాం కూర్చుని రేపటి భగవద్గీత క్లాస్‌కి ప్రిపేర్ అవుతూ ఉంటుంది. అప్పటికి వచ్చే డబ్బులతో 'మునార్' వెళ్తానా? నైట్ క్లబ్బులకి వెళ్తానా? ఎందుకు నాన్నా? రిటైర్ అయ్యేనాటికి వచ్చే డబ్బు? ఆ డబ్బు చూసుకుని మురిసిపోడమే కానీ, ఆ పాటికల్లా వచ్చే శంఖం చక్రంలా బీ.పి, షుగరూ, కొలెస్ట్రాల్, దానికి కానీ ఖర్చులేకుండా రెండు పూట్లా చేసే వాకింగులూ నెలకోసారి ఏ 'ఫ్యాక్టరీ ఔట్‌లెట్' సేల్ పెడ్తున్నాడో చూసి బట్టలూ షూసూ కొనడం మానేసి, 'ఏ నక్షత్రాల ఆస్పత్రి'వాళ్ళు రిబేట్లు ఇస్తున్నారో చూసి 'ఫుల్ హెల్త్ చెకప్స్' చేయించుకోడం. సామూహిక యోగా క్లాసులకి వెళ్ళి అదో టైప్ 'భావప్రాప్తి' పొందడం .. లైఫ్ ఇంతేగా నాన్నా?" అనాలనిపిస్తుంది కొడుక్కి.

ఓ రోజు మా అబ్బాయి ఇంటికొచ్చేసరికి నేనూ, మా ఆయనా 'బాగ్‌బన్' చూస్తున్నాం. వాడు హడావిడిగా వెళ్ళి టీ.వి ఆఫ్ చేసాడు.

"ఎందుకురా?" అన్నాను.

"ఇప్పటికే భరత్ వాళ్ళ నాన్నా, రాం వాళ్ళనాన్నా ఈ సినిమా ప్రభావంతో వాళ్ళని పిల్లలు విలన్స్‌లా చూస్తున్నారట "అమ్మా కొంచెం మా ఇంట్లో వారం వుంటావా శీలాకి క్యాంప్ పడింది" అనగానే "పిల్లలు అడ్డాలనాడు కానీ గడ్డాలనాడు కాదే మనం పెంచుకున్నాం. వాళ్ళు

పంచుకుంటున్నారు"లాంటి డైలాగ్‌లు కొడ్తున్నారట. అసలు ఈ 'బాగ్‌బన్' మూవీ వల్ల ప్రతి తండ్రికీ కొడుకులు ఆ సినిమాలో అమితాబ్‌బచ్చన్ చేతకాని కొడుకుల్లానే కనిపిస్తున్నారు. బయట నుండి 'ఎడాప్ట్' చేసుకున్న కొడుకు 'సల్మాన్‌ఖాన్' మంచివాడు. మరి ఈ తండ్రికి పుట్టిన ఇద్దరూ చెడ్డవాళ్ళే అంటే దోషం తండ్రిదే కదా!" అన్నాడు.

మిక్సీలో పచ్చడి చేస్తున్న నేను బయటకొచ్చి "తల్లితండ్రులని పంచుకోవాలన్న ఆలోచన ఈ హిందీ వాళ్ళకి ఇప్పుడు తెలిసిందా? మా తెలుగువాళ్ళకి నేను మూడో క్లాసులో వుండగానే తెలిసి 'బడిపంతులు' తీసారు. అదేకథ ఇన్ని ఏళ్ళకి వీళ్ళు తీసారు. చూసావా మనం ఎంత అడ్వాన్స్‌డో" అని కాలర్ ఎగరేసా!

మొత్తానికి మా అబ్బాయి బ్యాచ్ మాత్రం పెద్దవాళ్ళు దేనికైనా అతిగా ఫీల్ అయితే 'బాగ్‌బన్' సింద్రోమ్‌తో బాధపడుతున్నాం అంటారు. పిల్లలు అలా ఫీల్ అవడంలో అతిశయోక్తి కూడా ఏం లేదు. కొంతమంది పెద్దలు ప్రవచనాలు చెప్పేటప్పుడు 'తల్లితండ్రులని వదిలేసి అమెరికాకి వెళ్ళినవాళ్ళు, వీళ్ళు చస్తే కూడా రారు' అని దెప్పడం చూస్తున్నాం

అయ్యో! అసలు ఈ 'పిల్లలు' మనం కావాలని తెచ్చుకున్న 'లగ్జరీ'లు ఒకప్పుడు 'దేవుడిస్తున్నాడు మరి' అంటూ పధ్నాలుగు, పదిహేనుమందిని కని, పోయిన వాళ్ళుపోగా, వున్నవాళ్ళకి ముక్కోటి దేవతల పేర్లూ పెట్టి, ఇంకా పుట్టి బట్ట కట్టకపోతే 'ఛండాలమైన పేర్ల'తో 'పెంటయ్యా, పేడమ్మా, ఉమ్మి' అనికూడా పిలిచి, కంటూనే పోయేవారు. తరువాత 'వీళ్ళకి అన్నం పెట్టాలి. చదువు చెప్పించాలి. మంచి బట్ట కట్టాలి' అన్న యోచన వచ్చి 'ఫ్యామిలీ ప్లానింగ్' అన్నది పాటించారు. అదీ ఇద్దరు ముగ్గురి తర్వాత మగపిల్లాడు ఆ ముగ్గురిలో లేకపోతే ఇంకోటీ.. మరోటీ.

సరే అవన్నీ దాటి ఇప్పటి జనరేషన్‌లో 'ఒక్క పిల్లా లేదా పిల్లాడే' లగ్జరీ అయి కూర్చున్నారు.

మా చిన్నప్పటిలా గవర్నమెంట్ స్కూల్స్‌లేవు. ఒక్కొక్కడినీ, మాడుపగిలేలా, మా తరంలో 'ఎమ్.బి.బి.ఎస్‌కి పెట్టినంత చందాకట్టి ఎల్.కెజీలో వేస్తారు. అదీ 'ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో. ఆ సిలబస్, హోం వర్క్‌ల కోసం మదర్స్ అంతా వాట్స్‌అప్ గ్రూప్‌లు పెట్టుకుని చర్చించుకోవాలి. ఈ మెయిల్స్ స్కూల్ వాళ్ళు ఇచ్చేవి రెగ్యులర్‌గా చెక్ చేసుకోవాలి. తల్లీతండ్రీ రెగ్యులర్‌గా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కి వెళ్ళాలి. వాడి 'స్క్రేప్‌బుక్' వీళ్ళ 'ఫేస్‌బుక్' అప్‌డేట్ చేసుకుంటూ వుండాలి. మధ్యలో 'స్కూల్ డేస్ రిపబ్లిక్ డేస్, టీచర్స్ డేస్' అన్నింటికీ పిల్లలకి విచిత్ర వేషధారణలూ, కల్చరల్ ప్రోగ్రామ్‌లూ అంటే 'వేలకి వేలు' ఖర్చుపెట్టి డ్రెస్‌లు కుట్టించాలి. ఇంక కారూ, డ్రైవరూ వాళ్ళకి ప్రత్యేకం. పిల్లాడంటే 'నాటేజోక్' లక్షలతో పని.

మా స్కూల్లో మేం నాటకం వేస్తే, ముచ్చిత రేకుల కోసం సిగరెట్ పెట్టెలు ఏరుకుని, అందులోని 'గోల్డ్' కలర్ కాయితంతో చెవులకీ, మెడలకీ నగలు చేసుకునేవాళ్ళం. అమ్మమ్మవీ, నానమ్మవీ చీరలు ఎత్తుకెళ్ళేవాళ్ళం.

మా అన్నయ్య కోయదొరవేషానికీ, నేను సోది చెప్పే వేషానికి కూడా నగలూ పూసల దండలూ తాయెత్తులూ మేమే తయ్యారు చేసుకుని బొగ్గుతో మీసం, మొక్కజొన్న నారుతో గెడ్డాలు తయ్యారు చేసుకుని, స్క్రిప్ట్ మేమే రాసుకునేవాళ్ళం. అందుకే పెరిగింది మా క్రియేటివిటీ అంతేకానీ ఇలా పెద్దవాళ్ళు లక్షలు లక్షలు ఖర్చుచేసేవాళ్ళా? బెత్తం తిరగేసేవారు. ఎప్పుడైనా 'ఎక్స్‌కర్షన్‌కి' పదిరూపాయలడిగితేనే ఇచ్చేవాళ్ళుకారు. మా అమ్మమ్మ అయితే "మా అమ్మమ్మ కూడా వస్తుందని చెప్పు.. ఒప్పుకుంటే పంపిస్తా" అనేది. బస్సులో తోటి ఫ్రెండ్స్ మధ్యలో మా అమ్మమ్మని ఊహించుకోండి. ఈవిడా, ఈవిడ ఇత్తడి మరచెంబూ, నాలుగు గిన్నెల క్యారేజూ ఏం బాగుంటుంది? అందుకే మానేసేవాళ్ళం. ఇప్పుడసలు 'మానేసే' ఆప్షన్ స్కూల్ వాళ్ళు ఇవ్వనే ఇవ్వరు.

అమ్మో! ఆ మధ్య కాన్సెప్ట్ స్కూల్స్ అని, నర్సరీలోనే వాళ్ళకి బాక్సింగ్ దగ్గర నుండీ నేర్పిస్తాం అని పెట్టారు. అసలు రబ్బర్ స్కర్టింగ్‌లూ, మెత్తని పరుపులూట పిల్లల క్లాస్ రూములలో. పిల్లలు పడి దెబ్బలు తగిలించుకోకపోతే ఏం గట్టి పడ్తారండీ?

ఓనాడు మా అక్కయ్య మనవడు ఎనిమిదేళ్ళవాడు "టీచర్ నన్ను 'ఎర్త్' చెయ్యమంది" అన్నాడు. అసలు మనిషిని 'ఎర్త్'గా ఎలా చెయ్యాలో నాకు అర్థంకాలేదు. కానీ మా అమ్మాయి నెట్‌లో పరిశోధించి, వాడిలో అడవులూ, నీళ్ళూ, నిప్పూలాంటివి డిజైన్ చేసి, తయ్యారు చేసింది పాపం. ఇవన్నీ మా కాలంలో అమ్మానాన్నలు ఏం చేసేవాళ్ళండీ బాబూ?

అమ్మ ఆదివారం వస్తే ఇంటికి శాలరీ బిల్లులు తెచ్చి, నేలంతా పరిచి, బోర్లాపడుకుని చేసేది పాపం. ఆర్.టీ.సీలో ఉద్యోగం కండక్టర్లతో, డ్రైవర్లతో తేడాలొస్తే కష్టం. ఒక్కో ఆదివారం మా తలంట్లూ, ఇల్లు సర్దడం, ఎప్పుడైనా పండగలప్పుడు అసురుసుర్లు అయి పిండివంటలూ, కిరోసిన్‌కి 'క్యూ' చక్కెర, గోధుమలకి 'క్యూ', ఎలక్ట్రిసిటీ బిల్లుకీ, వాటర్ బిల్లుకీ 'క్యూ', ఇవన్నీ కాక సినిమా కెళ్ళినా, రైల్వే రిజర్వేషన్ అయినా, బస్‌స్టాప్‌లో అయినా 'క్యూ' ఖర్మం కాలి రోగం వస్తే, ఆర్.టీ.సీ ఆసుపత్రిలో చాంతాడంత 'క్యూ; చిన్నప్పుడు ఇంట్లో నల్లా రాకపోతే బయట బోరింగ్ దగ్గర 'క్యూ' లైన్ చివరకొచ్చి మనబిందె పెట్టేలోపే ఏ కాలనీ గూండా' బాకర్ బాయో' వచ్చి తన బాల్చీ పెట్టేవాడు. ఎదురాడడానికి లేదు. అసలు మధ్య తరగతి జీవితాలు 'బార్బర్; షాప్ నుండి కూరలబండిదాకా 'క్యూ'లతోనే గడిచేవి. ఇంక పిల్లలకి 'స్క్రాప్ బుక్కులూ' 'ఫ్యాన్సీ డ్రెస్సులూ' ఏం చూస్తారు?

ఏడాదికోసారి కొత్తపుస్తకాలు కొనాలంటే ఆ నోట్‌బుక్కుల కోసం, టెక్స్ట్ బుక్కుల కోసం క్యూ ఉండేది. తెచ్చి వాటికి అట్టలేసి లేబుల్స్ అంటించడానికే తీరికుండేది కాదు పాపం.

ఇప్పుడు తల్లితండ్రులు ఇంకా బిజీ. ఒక్క పిల్లలేదా పిల్లాడితోనే పాపం వాళ్ళ పనైపోతోంది. ఖర్చుకి ఖర్చూ, శ్రమకి శ్రమా. ఇంక షార్ట్ కాట్స్‌లో వాళ్ళు అతి మేధావులూ, అతీంద్రియ శక్తులున్నవాళ్ళూ కావాలనే తల్లితండ్రుల దురాశవల్ల ఈ మధ్య 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వాళ్ళు పిల్లలకి రెండేసి గంటలచొప్పున రెండు రోజులకి పదివేలు చార్జ్ చేసి, ప్రజ్ఞా యోగా అని కళ్ళకి గంతలు కాబట్టి ఎదురుగా వున్నవి కనిపించేట్టు చేస్తాం. అని క్లాసులు కండక్ట్ చేసారుట.

వాళ్ళు కళ్ళకి గంతలతో ఎదురుగా పెట్టినవి ఏవిటో చెప్తారుట. గోడ అవతల ఏం జరుగుతోందో చెప్తారుట. అన్నీ హంబక్. కింద పెడితే, బట్ట కిందనుండి ముక్కూ మూతికీ మధ్యనున్న ఎడం నుండి చూసి చెప్తున్నారు. గోడ అవతలవి పది చెపితే రెండు కరెక్ట్ అవుతున్నాయి. ఉత్త చీటింగ్ అని బాబూగోగినేని తేల్చి చెప్పేసాడు.

అసలు పిల్లలు బుద్ధిగా చదువుకుని మార్కులు తెచ్చుకోవాలికానీ, ఈ చేతబడులూ, అతీంద్రియశక్తులూ ఏవిటండీ బాబూ? బుద్ధిలేని తల్లితండ్రులు మారాలి. పిల్లలు 'సర్కస్'లో జంతువులు కాదు. వాళ్ళమీద ప్రయోగాలు మానెయ్యండి.

ఇంతకీ చెప్పొచ్చేది 'మిడిల్‌క్లాస్'లో ఫాదర్స్ చెప్పే మాటలు కామెడీకి కాదు. ప్రాక్టికల్‌గా లైఫ్‌కి ఉపయోగపడేవని అర్థం చేసుకోండి. ఉన్ననాడు రెండు రూపాయలు మిగుల్చుకోండి. లేనినాడు అక్కరకొస్తుంది. కరెంటూ, వాటరూ, టైం వేస్ట్ చెయ్యకండి. ఇప్పటికే యూనిట్‌కి బంగారం ధర చెల్లిస్తున్నాం మనం.




Post your comments

